
भारतीय रिज़र्व ब
RESERVE BANK OF IN
500
2EU 536976
AVM
500

# జి.ఆర్.సి.మూర్తి

నిన్నమొన్నటివరకూ నాగభూషణం నాబూజం ఫ్రెండ్. అంటే ఒకరి బుజాలొకరం రాసుకుని తిరిగేంత దోస్తీ. నాకంటే లెస్ క్వాలిఫైడ్ అయినప్పటికీ కోటా, రిజర్వేషన్, గాడ్‌ఫాదర్ ఇత్యాది కారణాల మూలంగా ప్రమోషన్ కొట్టేసాడు.

ఇప్పుడు తను నా పైఅధికారి. 'సాలామై సాహబ్ బన్ గయా' అంటూ ఆఫీసరు స్థానంలో ఆసీనుడైనాడు. అప్పట్నించీ రుబాబు చెయ్యటం మొదలైంది. వెనకటి చనువుతో పేరుతో పిల్చా ఒకసారి. 'ఏంటా ఏకవచన ప్రయోగం? యు ఆర్ రిపోర్టింగ్ టు మి అండర్‌స్టాండ్' అని అందరి ముందూ గాలితీసాడు. 'అండర్ స్టుడ్' అన్నా.

లీవ్ అప్లికేషన్స్‌లో అడుగున యువర్స్ మోస్ట్ ఒబీడియెంట్ అని రాయాలనేవాడు. యువర్స్ ఫెయిత్‌ఫుల్లీ అంటే సరిపోతుందని చెప్పా.

'ఏం కోర్టుల్లో జడ్జీలని యువరానర్ అనటంలా? గవర్నర్‌ని హిజ్ ఎక్స్‌లెన్సీ అనటం లేదా?' అని ఎదురు ప్రశ్న వేసాడు.

'అది బ్రిటిష్ లెగసీ కావచ్చు. పై అధికారిని 'సర్' అన్నా గౌరవమైన పదమే' అన్నా.

తను ఆఫీసులో ఎంటర్ అవుతుంటే అందరూ లేచి నిలబడి విష్ చెయ్యాలనేవాడు. ఏ సినిమాలో చూసాడో గురుడు.

'యు మస్ట్ కమాండ్ రెస్పెక్ట్. యు మస్ట్ నాట్ డిమాండ్ రెస్పెక్ట్' అన్నా పక్కనుంచి.

'ఎంప్లాయెర్ పట్ల గౌరవం అవసరం లేదా?' అన్నాడు.

'ఎంప్లాయెర్ మీరు కాదు. గవర్నమెంటు. ఆ మాట కొస్తే మీరూ ఎంప్లాయీనే. ఛోటా నౌకర్, బడా నౌకర్ అంతే తేడా' అన్నా.

భూషణానికి నా మాట మింగుడుపడలేదు. 'యు ఆర్ టీచింగ్ మి లెస్సన్... అయాం యువర్ సుపీరియర్. నీ మాన్యుయల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు నా చేతుల్లో వుందని తెల్సుకో' అన్నాడు.

భూషణం యిలా అందరి మీదా ఎగిరి, అనతి కాలంలోనే అన్‌పాపులర్ అయ్యాడు. ఎంప్లాయీస్ చాటుమాటుగా భూషణాన్ని బోషాణం అనేవారు. సబార్డినేట్స్‌ని సొంత పనులకు వినియోగించుకోవడమే తప్పైతే ప్యూన్‌ని పిల్చి 'ఇంటికెళ్లి లంచ్‌బాక్స్ పత్రావోయ్' అని ఒక్క ముక్క చెప్పేదానికి 'దొరసానితో చెప్పు... అయ్యగారు క్యారేజి పత్రమ్మన్నారని' అనేవాడు.

ఒక రోజు నాకు క్లాసు పీకాడు.

'డు యు నో ది సీక్రెట్ ఆఫ్ మై సక్సెస్?' అనడిగాడు.

'మీరు ఎల్లప్పుడూ లక్స్ సబ్బునే వాడతారా లేక బూస్ట్ తాగుతారా?' అన్నా.

'ప్రోస్ట్రేట్ బిఫోర్ ది టాప్. కిక్ ది సబార్డినేట్. దటీజ్ ద సీక్రెట్ ఆఫ్ మై సక్సెస్. అంటే అర్థం అయిందా? పైవాళ్ల ముందు సాగిలపడు, కింద వాళ్లను మొట్టు... అని'.

'ఇంతకూ నన్ను పిల్చిన కతంబేమి? అనతీయండి'

'తెలుగు మీడియమా?'

'యా'

'మున్సిపల్ స్కూలా?'

'ఔనండి. మాది పూర్ ఫ్యామిలీ. పెద్ద కుటుంబం. ఐ హ్యాడ్ నాట్ ది ప్రివిలేజ్ ఆఫ్

కాన్వెంట్ ఎడ్యుకేషన్.'

'ఆ విషయం వదిలేయ్. నా గది బైట రెడ్ లైట్ ఏర్పాటు చెయ్. ఎవరుబడితేవాళ్లు తలుపు తట్టి లోపలికొస్తున్నారు. అట్లా కుదర్దు. హెన్స్ ఫోర్త్ ఇది రెడ్ లైట్ ఏరియా అని అందరికీ తెలియాలి.'

'రెడ్ లైట్ ఏరియా అంటే మీనింగ్ మారిపోద్ది. ప్రస్తుతం మీకు బజరుంది కదా' అన్నా.

'మే ఐ కమిన్ అనకుండానే జనాలు లోపలకి వచ్చేస్తున్నారు. బొత్తిగా ప్రైవసీ అనేది లేకుండా పోయింది. మీ మేడంతో కూడా ఫోన్లో మాట్లాడటం కుదరట్లేదు. ఏంచేస్తావంటే... 'ఇంటర్వ్యూస్ బిట్వీన్ 3 అండ్ 4 పి.ఎం., అదర్‌వైజ్ బై ఎపాయింట్‌మెంట్' అని బోర్డు పెట్టించు.

చిత్తం అని రాబోతూంటే దాన్తో పాటు ఒక చిన్న బోర్డు కూడా బిగించమని చెప్పు... 'బాస్ యీజ్ ఆల్వేస్ రైట్' అని.

'మీ మాటే వేదం' అన్నాను.

'దట్స్‌గుడ్. నువ్వు తప్పకుండా పైకి పోతావ్'

'పైకొస్తావ్ అనండి లేకపోతే వేరే మీనింగ్ వస్తుంది' అన్నా.

ఇంతలో కొత్తగా చేరిన అమ్మాయి జాయినింగ్ రిపోర్టు యివ్వడానికొచ్చింది. 'పని కొచ్చేటట్లుంది' అన్నాడు నావైపు క్రీగంట చూస్తూ.

'ఆ అమ్మాయి మన ఆఫీసులో పనికి వచ్చింది. మీరన్న మాటలో వేరే అర్థం ధ్వనిస్తుంది. డోన్ట్ లుక్ ఎట్ ఉమెన్ విత్ ఎ డిజైర్ అన్నాడు మహాత్ముడు. పరాయి ఆడపిల్లను తోబుట్టువులా చూడాల'ని చెప్పా చెవులో.

'నేనా దృష్టితో చూళ్లేను'.

'అయితే దృష్టిలోపం అన్నమాట'.

'లోకంలో ప్రతి ఆడపిల్లనూ చెల్లిగానో అక్కగానో భావిస్తే నీకు నాకు అసలు పెళ్లి అయ్యేదే కాదు'

'ఈ మాటలు పెద్దగా అనకండి. మనల్ని 'గే'కింద జమకడతారు'.

'అదేనోయ్ అట్లా చూస్తే మనకు పెళ్లాలు వచ్చేవాళ్లు కాదు' తన విట్టుకు తనే పగలబడి నవ్వాడు భూషణం.

నేను నవ్వకపోయేసరికి 'బాస్ నవ్వితే నువ్వూ నవ్వాలి' అని చెప్పాడు.

'ఏడిస్తేనో' అని మనసులో అనుకుంటూ చాంబర్ లోంచి బైటికొచ్చాను.

* * *

కొత్తగా చేరిన అమ్మాయి ప్రొబేషనరీ పీరియడ్ పూర్తిచేసింది. ఒక రోజు ఆ అమ్మాయిని లోపలికి పిల్చి 'నీ గురించి శాటిస్‌ఫ్యాక్టరీ రిపోర్ట్సు అందినయ్. నీ ప్రొబేషన్ డిక్లేర్ చేస్తున్నా' నన్నాట్ట. ఆ అమ్మాయి థ్యాంక్స్ అందట. ఉత్త థ్యాంక్సేనా ఐ వాంట్ హగ్స్' అన్నాడట భూషణం.

ఆ అమ్మాయి ఏడుస్తూ వచ్చి యూనియన్ లీడర్ రఫీతో చెప్పింది. వాటీజ్ ఫ్యాక్ట్ వాటీజ్ ఫిక్షన్ అని తెల్సుకునేందుకు ప్లస్ పన్లో పనిగా యూనియన్ చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌తో రఫీ లోపలికి వెళ్లాడు.

స్టెనో ఊర్మిళ పయిట సరి చేసుకుంటూ కంగారుగా బైటికొచ్చింది. ఆ రోజున 'బొత్తిగా ప్రైవసీ అనేది లేకుండా పోయింది' అంటే అర్థమిదన్నమాట అనుకున్నా.

గిల్టీ కాన్షన్స్ కాకపోతే రఫీని మాట్లాడనీయ

కుండా 'టు హెల్ విత్ యువర్ చార్టర్ ఆఫ్ డిమాండ్స్. త్రో ఇట్ యిన్ బే ఆఫ్ బెంగాల్' అన్నాడు శివం ఎత్తినట్లు.

ఇకనేం...? ఆఫీసులో అందరూ పెన్ డౌన్ చేసి ఆవరణలో స్లోగన్స్అందుకున్నారు. ఉద్యోగ ప్రతినిధులంటే యింత చులకనా? వుయ్ విల్ పే హిమ్ బ్యాక్ ఇన్ హిజ్ ఓన్ కాయిన్ అని శపథం చేశాడు ఒక చోటా నాయకుడు.

ఇంక్విలాబ్ జిందాబాద్...

నాగభూషణం గద్దె దిగు... గద్దె దిగు...

నాగభూషణం హాయ్ హాయ్...

రఫీ జుగ్ జుగ్ జియో...

స్లోగన్స్‌తో ఆవరణ ప్రతిధ్వనించింది. మహిళా సమాఖ్యకు ఉప్పందించారెవరో. రాగానే ఆవిడ ఉపన్యాసం అందుకుంది...

...ముగ్గురు మహిళలు అత్యున్నత స్థానాల్లో వున్న ఈ దేశంలో స్త్రీకి రక్షణ లేకుండా పోయింది. కీచకుల బారి నుండి మహిళలను కాపాడాలి. మన రాష్ట్రంలో 'ఏదో మూలన రోజూ మహిళలపై దాడి జరుగుతోంది...'.

ఒక ఆవేశపరుడు నాగభూషణం దిష్టిబొమ్మను తగలబెట్టాడు. పరిస్థితి చేయిదాటి పోతూండడంతో డోర్‌లాక్ చేసుకుని కూర్చున్న భూషణంతో 'మీరు ఒక్క నిమిషం బైటికొచ్చి 'సారీ ఫర్ వాట్ హ్యాపెన్డ్' అని చెప్పండి లేదా ఎట్‌లీస్ట్ రెండక్షరాల పదం 'సారీ' అని చెప్పండి. పరిస్థితి సద్దుమణుగుతుంది' అని చెప్పి చూసాం. వింటేగా?

'ఆ రఫీగాడు ఒట్టి రఫియన్. హి డజ్‌నాట్ నోమి... అండమాన్స్‌కి పంపిస్తా. వాట్ డజ్ హి థింక్ ఆఫ్ హిమ్‌సెల్ఫ్? ఆఫ్ట్రాల్ ఎటెండర్. ఎటికెట్ లేకుండా డైరెక్టుగా లోపలికొచ్చేస్తాడా? ఐవాజ్ డిక్టేటింగ్ ఎ కాన్ఫిడెన్షియల్ లెటర్' అన్నాడు ఆవేశంగా.

'కూల్‌డౌన్. కూల్ డౌన్. మీరు స్టాఫ్‌తో డు యు నో? యు ఆర్ స్పీకింగ్ టు యాన్ ఆఫీసర్... అని తరచు యీ పదజాలం ఉపయోగిస్తున్నారు. క్లర్క్ అని, సూపర్‌వైజర్ అని డెజిగ్నేషన్లు వాళ్ల వాళ్ల రెస్పాన్సిబిలిటీస్‌కి అనుగుణంగా ఎడ్మినిస్ట్రేటివ్ కన్వీనియెన్స్ కొరకు ఏర్పరచినవే గానీ సూపర్‌వైజర్ అంటే సూపర్ వైజ్‌గా ఉంటాడని అర్థం కాదు. ఆఫీసు నాలుగు గోడల మధ్యే యీ హోదాలు. బైటికొస్తే అందరూ సమానమే...'

'నువ్వేమీ శల్య సారథ్యం చెయ్యక్కర్లేదు. నాకు కోపం వస్తే అందర్నీ 'శాక్' చేసి పడేస్తా. ఐ విల్ లుక్ ఆఫ్టర్ ది ఆఫీస్ మై సెల్ఫ్'.

'అందర్నీ యిళ్లకు పంపించి అందరి పనీ మీరొక్కరే చేయటం సాధ్యమేనా? ప్రాక్టికల్‌గా ఆలోచించండి. మీరు ఎఫీషియెంట్ కావున ఇద్దరు... మహా అయితే ముగ్గురి పని మీరు అవలీలగా చేయగలరనుకుందాం. బట్ హౌ లాంగ్? ప్యూన్ సర్వీస్ లేకుండా నిర్వర్తించగలరా? పోనీ ఒకరోజు, రెండ్రోజులు... ఇరవై నాలుగు గంటలు ఆఫీసుకి అంకితం కాలేరు కదా? ఇల్లు, ఇల్లాలు ఏం కావాలి? యునో సమ్ డ్యూటీ టు ది ఫ్యామిలీ ఆల్సో. ఆఫీసు కాగానే నా పతిదేవుడు యింటికొస్తాడని మీ ఇల్లాలు ఎదురుచూస్తూండవచ్చు' అన్నా.

భూషణానికి నామాట రుచించలేదు సరి కదా. 'యు ఆర్ మై ఫ్రెండ్ ఆర్ ఫో?' అన్నాడు. 'పోతున్నాలే' అని నేను ఇవతలికి వచ్చేసాను.

కొందరు యిన్‌కొరిజిబుల్ పర్సన్స్ వుంటారు. వాళ్లు మారరు. వాళ్లను మార్చటం ఎవరి వల్లా కాదు. ఈ కోవకు చెందినవాడే భూషణం.


జరిగిన సంఘటన తర్వాతనైనా మనిషిలో ఏదైనా మార్పు వస్తుందనుకున్నా. షరా మామూలే.

ఆఫీసు మస్టరులో ముగ్గురు ప్యూన్లు వున్నారన్నమాటేగాని ఇటు ఫైల్స్ అటు అందించడానికి ఒక్కళ్లూ అందుబాటులో వుండేవాళ్లు కాదు. ఒకడేమో భూషణం పిల్లవాణ్ణి కాన్వెంటులో దింపి రావడానికి, ఒకడేమో ఇంట్లో బట్టలు వుతకడానికి, ఒకడేమో తోటపని, అమ్మగారికి సహాయంగా వుండటానికి, డ్రైవర్ 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని బోర్డు వున్న జీపులో కూరలు తీసుకురావడానికి... ఈ విధంగా పోర్టుఫోలియోలు కేటాయించాడు భూషణం. దీన్ని 'పవర్ని మిస్యూజ్ చెయ్యటం అంటారో ఎబ్యూజ్ చెయ్యటం అంటారో' నాకు తెలీలేదు.

భూషణాన్ని ఎప్పుడూ కెన్యు డు మి దిస్ ఫేవర్ అని అడగనివాణ్ణి నా శ్రీమతి ప్రోద్బలంతో ఒకరోజు నోరుతెరిచి అడిగాను. 'భోషాణం సార్. సబ్ డివిజన్లో సూపర్నెంట్ పోష్టు శాంక్షన్ అయిందట. మీరు నాయందు దయయుంచి నా పేరు రికమండ్ చేస్తే మా ఇంట్లో మీ ఫొటో పెట్టుకుంటాను' అన్నా.

భూషణం చిద్విలాసంగా నవ్వి 'పిచ్చివాడా! నువ్వు గాడిద చాకిరి చేస్తావు. నీవు ఆఫీసు పన్జేస్తే హౌ మై పర్సనల్ ఇంట్రెస్ట్ యీజ్ సర్వ్డ్' అన్నాడు. 'కాస్త యాంప్లిఫై చెయ్యండన్నా'.

'మేడం బండెడు గుడ్డలు వుతుక్కోలేక నానా



దుర్గానంద్ సాహిత్య కళాపీఠం, మానస ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రసిద్ధకవి దుర్గానంద్ కావ్యం "అంతర్గోళాలు" ఆవిష్కరణ సభ జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ కె. శివారెడ్డి కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఓల్గా, సాంధ్యశ్రీ, సుధామ, కిరణ్‌బాబు, రఘుశ్రీ, అంబికానంద్ తదితరులు సభలో పాల్గొన్నారు.

అవస్థలూ పడుతోంది. వాషింగ్‌మెషిన్ కావాలని ఎప్పటినుంచో అడుగుతోంది. ఎప్పటికప్పుడు పోస్ట్‌పోన్ చేస్తూ వస్తున్నాను, ఎవరైనా ప్రెజెంట్ చెయ్యకపోతారా అని...'

నేనేం మాట్లాడకుండా నిలబడ్డాను.

తనే కంటిన్యూ చేసాడు. 'క్విక్‌గా గ్రాస్ప్ చెయ్యాలి. వెన్ యు ఆర్ గెట్టింగ్ సంథింగ్, యు హ్యావ్ టు ఫోర్గో సంథింగ్. ఎమౌంట్ స్పెంట్ ఆన్ది బాస్ ఈజ్ నాట్ ఎ వేస్ట్, ఇటీజ్ యాన్ ఇన్వెస్ట్‌మెంట్'.

అతని మాటల్లోని ఆంతర్యం గ్రహించాను. ఇన్ క్యాష్ ఆర్ ఇన్ కైండ్ అడుగుతున్నాడని. 'మీ దయ, నా ప్రాప్తం. ఐ హ్యావ్ ఎ క్లీన్ రికార్డ్' అని వచ్చేసాను.

కొన్నాళ్లకు భూషణానికి నంద్యాల నుండి నాగర్‌కర్నూల్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది. రఫీని రహస్యంగా అడిగాను 'నువ్వేనా పుణ్యం కట్టుకున్నది? అని...'

'నేను మన వాళ్లందరి సిగ్నేచర్స్ కలెక్ట్ చేసి పైకి పంపించాను యీ మూర్ఖ శిఖామణికి త్వరలో స్థానభ్రంశం కల్పించమని. తెగ రెచ్చిపోతున్నాడు... ఓర్చుకున్నంతకాలం ఓర్చుకున్నాం. దేరీజ్ ఎ లిమిట్ టు టాలరెన్స్. సహనానికైనా హద్దు వుండాలి. మొన్న ఆఫీసులో చేరిన న్యూగైతో ఫస్ట్ లెర్న్ పుష్ ఎన్డ్ పుల్ అన్నాట్ట. తర్వాత నేను చెప్పింది డోరు గురించి అన్నాట్ట'.

* * *

ఎట్లాగూ వెళ్తున్నాడు కనక చిన్న ఫేర్‌వెల్ పార్టీ యిద్దామని ప్రపోజ్ చేశాను. స్టాఫ్ అందరూ పావలా చొప్పున కంట్రిబ్యూట్ చేస్తానన్నారు... హి డజ్ నాట్ డిజర్వ్ అంటూ.

నా డబ్బుల్తో నేనే గెట్‌టుగెదర్ ఏర్పాటు చేసాను. నాలుగు ముక్కలు మాట్లాడమంటే ఎవ్వరూ ముందుకు రారే? అందరూ 'యు స్పీక్ గుడ్ ఇంగ్లీష్' అని ములగచెట్టు ఎక్కించి నన్ను ముందుకు తోసారు. ఒకే ఒక స్పీకర్‌ని నేనే...

ఫ్రెండ్స్,

టు ఎన్యూమరేట్ హీజ్ నోబుల్ క్వాలిటీస్ ఎన్డ్ టు డ్వెల్ ఆన్ దెమ్ విల్ బి లైక్ స్విమ్మింగ్ ది ఓషన్. బట్ ఐ విల్ బి ఫెయిలింగ్ ఇన్ మై డ్యూటీ ఇఫ్ ఐ డునాట్ డిటైల్ ఎ ఫ్యు ఆఫ్ హీజ్ అవుట్ స్టాండింగ్ క్వాలిటీస్... ఇంక చాలన్నట్లు స్టాఫ్ అంతా చప్పట్లు కొట్టారు.

భూషణం పార్టింగ్ మెసేజ్ అందర్నీ నిరుత్సాహపరిచింది.

'యు మస్ట్ బి ఎ గుడ్ సర్వెంట్ బిఫోర్ యు బికం ఎ గుడ్ మాస్టర్.' ఫార్మాలిటీకైనా ఎవరూ చప్పట్లు కొట్టలేదు. ఆపినా బాగుండేది. స్పీచ్ కొనసాగించాడు. 'మీకు తెల్సు ఐయామ్ ఎ స్ట్రిక్ట్ డిసిప్లినేరియన్. నా డిసిప్లైన్ నచ్చని కొందరు నా మీద పిటిషన్ పెట్టారని తెల్సింది. వాట్ అడాసిటి? టేకింగ్ అన్ డ్యు ఎడ్వాంటేజ్ ఆఫ్ మై సెగాసిటీ'.

ఒక స్టాఫ్ మెంబరు లేచి 'మీరు హై లాంగ్వేజి వాడుతున్నారు అంగ్రేజి బాగా వచ్చని. మాకు ఒక ముక్క అర్థం కావటంలా' అన్నాడు. పార్టీ అంతటితో ముగిసింది. ఈ సిటీల గొడవేంట్రా బాబాయ్ అన్నాడు గుంపులో గోవిందయ్య ఒకడు.

* * *

ఒక ఏడాది తరువాత మా ఎక్స్ బాక్స్ సారి... ఎక్స్ బాస్ మాఇంటికొచ్చాడు అకస్మాత్తు

గా. 'వాట్ ఎ ప్లజంట్ సర్‌ప్రైజింగ్. ఏంటి యిలా వచ్చారు' అన్నా.

'మా అమ్మాయిని యమ్‌సెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేర్పించి, ఒక్కసారి నిన్ను చూసి పోదామని వచ్చా'నన్నాడు. నా శ్రీమతి యిచ్చిన నీరు, తేనీరు త్రాగి 'అమ్మాయ్! స్వతంత్రించి అడుగుతున్నాను. ఏమీ అనుకోవద్దు. నల్ల పూసల గొలుసు తప్ప మీ ఆయన ఏమీ సొమ్ము చేయించలేదా?' అన్నాడు.

'ఆయన్నే అడగండి' అంది నా భార్య న్యూట్రల్‌గా. 'బంగారం గ్రాము రెండు వేలుంది. రోల్డ్‌గోల్డ్‌తో తృప్తిపడటమే' అన్నా.

ఇంతలో మా రెండో అబ్బాయి స్కూల్ నుంచి వచ్చాడు. కొత్త శాల్తీని చూసి 'ఎవరు నాన్నా ఈయన' అని అడిగాడు. 'ఈయన ఫైర్ బ్రాండ్, షాటింగ్ మాస్టర్, మార్టినెట్ బహు బిరుదాంకితుడు' అన్నా.

ఎప్పుడూ సీరియస్‌గా వుండే భూషణం పాతతరం విలన్ రాజనాలలా పెద్దగా నవ్వాడు.

'గుడారం లాంటి యీ యింట్లో ఎట్లా వుంటున్నావోయ్?'

'అయ్యా. దీనికే రెండువేలు. ఏటా పది శాతం పెరుగుదల. మన జీతాలు పెరిగేది ఐదేళ్ల కొకసారి'.

'ఎస్టాబ్లిష్‌మెంట్ సీట్లో వున్నావు. ఏం లాభం. నువ్వు తినవు, ఇంకొకళ్లను తిననివ్వవు. తినాలి, తినిపించాలి.'

'నాకు ఆ రెండూ చేతకాదు'

'మారుతున్న కాలాన్ననుసరించి మనం మారాలి. మడిగట్టుకుని కూర్చుంటే లాభం లేదు. రేపు నీ పిల్లలు మంచి ర్యాంకు తెచ్చుకుని పై చదువులకు అమెరికానో, ఆస్ట్రేలియానో వెళ్తాం అంటారు. ఎలా పంపిస్తావ్?'

'ఆర్థికమాంద్యం మూలంగా అమెరికాలో వున్న మనవాళ్లను వెనక్కి పంపించేస్తున్నారు. ఆస్ట్రేలియాలో చితగ్గొట్టున్నారు. కనుక ఆ క్వెశ్చనే లేదు.

ముందు ముందు అనేక ఖర్చులుంటాయ్. దూరదృష్టితో చెప్తున్నా సంపాదించే కాలంలోనే నాలుగురాళ్లు వెనకేసుకోవాలి. నీది ఫెచ్చింగ్ సీటే కదా. యుకెన్ మింట్ మనీ. అడిగి తీసుకుంటే తప్పుకానీ, అడక్కుండా యిస్తే తప్పెలా అవుతుంది?'

'ఇచ్చినవాడు సంతోషంగా యిచ్చాడంటారా? అవతలికి పోయి తిట్టుకుంటాడు'.


'పోనీ ఏమైనా వెనకేస్తున్నావా? జీతం మొత్తం ఖర్చు పెట్టేస్తున్నావా? యు హేవ్ టు సేవ్ సంథింగ్ ఫర్ది రైనీ డే'.

'యుసేవ్ ఫర్ ది టెంపెస్ట్' అన్నా.

అప్పటివరకూ తలుపు దగ్గర నిలబడ్డ నా భార్య 'మీరూ, అన్నయ్యగారూ అస్తమానం ఆంగ్లంలో సంభాషిస్తారెందుకండీ? మన మాతృ భాష వుండగా. ఈమధ్యనే ప్రాచీన భాష హెూదా కూడా వచ్చింది కదా. టీవీ యాంకర్ సుమ తెలుగు మాతృభాష కాకపోయినా ఎంత స్వచ్ఛంగా మాట్లాడుతుందో' అన్నది.

'మాతృభాష మీద మమకారం లేక కాదు. కొన్ని ఆంగ్ల పదాలు మనదైనందిన జీవితంలో భాగమైనాయి. ట్రయిన్ కోసం వెయిట్ చేస్తున్నా అంటే బాగుంటుంది కానీ ధూమశకటం లేదా పొగ బండి రాకకై నిరీక్షిస్తున్నా అంటారా ఎవరైనా?' అన్నా.

భూషణం మావైపు ఒక లుక్ యిచ్చి 'ఐడి




యల్ కపుల్' అని ఒక కాంప్లిమెంట్ యిచ్చాడు.

* * *

ఒక రోజు భూషణం ఫోను చేసాడు.

'ఏం సార్. రాయలసీమలోనే సెటిలై పోతారా? మన ప్రాంతానికి రారా' అన్నా.

'మెయిన్ ఆఫీసులో ఒక వేకెన్సీ వుందోయ్. డబ్బులు గిట్టుబాటు అయ్యే సీటు. మూడేళ్లలో మిలియనీర్ కావచ్చు. ఇద్దరు ముగ్గురు పోటీ పడి పైరవీలు చేస్తున్నారని విన్నా. వై షుడ్ పే లాగ్ బిహైండ్. దానికో మాస్టరు ప్లాను వేసా...' ఇంతలో లైన్ కట్ అయ్యింది.

* * *

ఒక రోజు దినపత్రికలో ఓ సంచలన వార్త చదివి అవాక్కయ్యాను.

మెయిన్ ఆఫీసులో పోస్టింగ్ కోసం భూషణం చీఫ్ ఇంజనీర్‌కి యాభైవేలు లంచం యివ్వజూపాడని, ఆయన 'డోన్ట్ థింక్ అయాం సో చీప్' అని ఎసిబికి ఫోను చేశాడని, యీ విషయం తెల్సి పత్రికా విలేఖరులు చుట్టుముట్టారని, తాను హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్ కొనేందుకు పైకం తెచ్చానని, మెయిన్ ఆఫీసు ఎప్రూవల్ కోసం తెచ్చిన ఫైల్‌తో పాటు క్యాష్ కవర్ సి.ఇ. టేబుల్ పైన పొరపాటున పెట్టాననీ, ఆ మాట కొస్తే అయాం టోటల్లీ ఎగెనెస్ట్ కరప్షన్ అని బుకాయించాట్ట. కానీ లాభం లేకపోయింది.

కొందరికి ధనదాహం, కొందరికి అధికార దాహం. భూషణం రెండిటి మిశ్రమం.

పేపర్లో వచ్చిన విషయమే ఒక టివి చానల్ క్రైమ్ స్టోరీగా ప్రసారం చేసింది. నేను టీవీ చూస్తూండగా మా అబ్బాయి ఒక మూల కూర్చుని ఇంగ్లీషు పాఠం చదువుతున్నాడు... 'ఎ కంటెంటెడ్ లైఫ్ యీజ్ ఎ కంటిన్యుయస్ ఫీస్ట్'.

చక్కని ఉపమానం అనుకున్నా మనసులో. ●